సాక్షి హైదరాబాద్

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



ఇక నో సిల్ట్!
ఘనవ్యర్థాల నిర్వహణపై బల్దియా అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు నాలాల సిల్ట్‌ను తరలించ కూడదని ఇంజినీర్లకు స్పష్టం చేశారు. -IIలో



.. వరమా? శాపమా?
ఆధునిక సాంకేతికత కారణంగా నగర జీవనశైలి పూర్తిగా మారిపోయింది. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ టెక్నికల్ లైఫ్‌గా మారిపోయింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
37.0/23.0
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఇక ప్రభుత్వ స్థలాల డిజిటలైజేషన్

అనుదీప్ దురిశెట్టి



లక్డీకాపూల్: హైదరాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలు డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వినియోగంలోఉన్నవి, వినియోగంలో లేని, ఖాళీగా ఉన్న స్థలాల వివరాలు సేకరించి డిజిటలైజేషన్ చేయనుంది. ఇందుకు పైలట్ ప్రాజెక్ట్‌గా తిరుమలగిరి మండలాన్ని ఎంపిక చేశారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) నిర్ణీత యాప్‌లో నమోదు చేసేందుకు జిల్లా రెవెన్యూ అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ నెల 22 నుంచి ప్రభుత్వ భూముల వివరాలు అప్‌లోడ్ చేయనున్నారు. ఆ దిశగా లక్ష్యం నిర్దేశించుకుని పని చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ యంత్రాంగంతో నిర్వహించిన సమావేశంలో ల్యాండ్ బ్యాంక్, ప్రభుత్వ భూముల కేటాయింపులు తదితర 20 అంశాలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. ల్యాండ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ సిస్టంను అప్‌డేట్ చేసి వివరాలను డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ప్రయోగాత్మకంగా తిరుమలగిరి మండలంలో ఈ నెల 22న ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని, అనంతరం మిగతా మండలాలకు విస్తరించేలా రెవెన్యూ యంత్రాంగం సమాయత్తం కావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీరాం, ఈడీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి నుంచి మరిన్ని రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ నుంచి రాకపోకలు సాగించే మరిన్ని రైళ్లను చర్లపల్లి టెర్మినల్ నుంచి నడిపేందుకు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే పలు దూర ప్రాంత రైళ్లను ఇప్పటికే చర్లపల్లికి మళ్లించారు. వేసవి ప్రత్యేక రైళ్లు సైతం చర్లపల్లి నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ పదో నంబర్ ప్లాట్‌ఫాం వైపు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దీంతో పదో నంబర్ నుంచి ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫాం వరకు రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఆ రైళ్లను చర్లపల్లికి మళ్లించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఈ నెల 28 నుంచి సికింద్రాబాద్-అగర్తలా (07030/07029),సికింద్రాబాద్-ముజఫర్‌నగర్ (05294/05293), సికింద్రాబాద్-సంత్రాగచ్చి (07221/07222), సికింద్రాబాద్- దానాపూర్ (07647/07648), హైదరాబాద్-రక్సాల్ (07051/07052) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు చర్లపల్లి టెర్మినల్ నుంచి రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లు సికింద్రాబాద్‌కు వెళ్లకుండా మౌలాలి క్యాబిన్, అమ్ముగూడ, సనత్‌నగర్ స్టేషన్‌ల మీదుగా నడుస్తాయి.









పరుగు వరద పారేనా!

ఉప్పల్ స్టేడియంలో ఈ సీజన్ నాలుగో ఐపీఎల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. శనివారం పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. సొంత మైదానంలో గత రెండు మ్యాచ్‌ల్లో అపజయంతో నిరాశపర్చిన హైదరాబాద్ టీమ్ ఈసారైనా చెలరేగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అటువైపు పంజాబ్ కింగ్స్ టీమ్ మంచి ఫామ్‌లో ఉండటంతో పరుగుల వినోదానికి పూర్తి ఆస్కారం ఉంది. శుక్రవారం రెండు జట్ల సభ్యులు ఉప్పల్ స్టేడియంలో కసరత్తు చేశారు. - సాక్షి, హైదరాబాద్

నగర సిగన.. మరో నగ!



- మూడు ప్రాంతాల్లో ఐలాండ్‌లు సైతం..
- సింగపూర్‌లోని గార్డెన్స్ బై తరహాలో అభివృద్ధి
- జూన్‌లో టెండర్లకు అధికారుల కసరత్తు
- అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష సమావేశం

మీరాలం ట్యాంక్‌పై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం



కేబుల్ బ్రిడ్జి నమునా చిత్రం

సాక్షి, సిటీబ్యూరో:

నగరంలోని దుర్గం చెరువు తరహాలో రెండో కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. మీరాలం ట్యాంక్‌పై 2.5 కిలోమీటర్ల పొడవున నాలుగు లైన్ల ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీరాలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జి నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మీరాలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్‌లను సిద్ధం చేయాలన్నారు. సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే డిజైన్లను ఎంచుకోవాలని ఆయన సూచించారు.

మూడు దీవులు..

పర్యాటక ప్రాంతంగా మీరాలం ట్యాంక్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే ట్యాంక్‌లో సహజసిద్ధమైన రెండు దీవులు (ఐలాండ్స్) ఉన్నాయి. ఒకటి 5 ఎకరాలు, మరొకటి 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఇవీ ఉన్నాయి. గతంలో ఇక్కడకు వెళ్లేందుకు పర్యాటక శాఖ బోటింగ్‌లను నిర్వహించేది. తాజాగా ఈ రెండింటితో పాటు మరోటి, మొత్తం మూడు ఐలాండ్స్‌ను నిర్మించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సింగపూర్‌లోని గార్డెన్స్ బై ది బేను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. బోటింగ్‌తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలన్నారు. పీపీపీ విధానంలో ఈ ఐలాండ్లను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

జూపార్క్ అప్‌గ్రేడ్..

మీరాలం బ్రిడ్జితో పాటు మూడు ఐలాండ్స్‌కు పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని సీఎం నిర్ణయించారు. ఇక్కడి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జూ పార్క్‌ను సైతం అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మీరాలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు రూపొందించాలని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు అవసరమైన హైడ్రాలజీ తో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

నో సెక్యూరిటీ..

గ్రేటర్ పరిధిలో 20 లక్షలకు పైగా వాహనాలకు..

- భారీగా పెండింగ్‌లో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో మరోసారి కదలిక
- పాత, కొత్త వాహనాలకు డీలర్ల వద్దే ఏర్పాటు
- సయామ్ పోర్టల్‌లో నమోదుకు అవకాశం
- రవాణా శాఖ నిర్ణయం.. వాహనదారుల్లో గందరగోళం



సాక్షి, సిటీబ్యూరో: ఏళ్లకేళ్లుగా నత్తనడకన నడుస్తున్న హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ల (హెచ్ఎఎస్ఆర్‌పీ)లో మరోసారి కదలిక వచ్చింది. భద్రత దృష్ట్యా ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్ తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలతో రవాణా శాఖ అప్రమత్తమైంది. పాత, కొత్త వాహనాలన్నింటికీ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న సుమారు 20 లక్షలకు పైగా వాహనాలకు ఇప్పుడు హెచ్‌ఎస్ఆర్‌పీ తప్పనిసరిగా మారింది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఏర్పాటు చేసుకోవాలని రవాణాశాఖ పేర్కొనడంతో వాహనదారుల్లో గందరగోళం నెలకొంది.

నత్తకు నడకలు నేర్పేలా..

సామాజిక భద్రత, వాహనాల భద్రత దృష్ట్యా 2013లో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. కానీ.. నంబర్ ప్లేట్‌ల తయారీలో తీవ్రమైన కొరత, డిమాండ్ మేరకు సరఫరా లేకపోవడం, అప్పటి ఉద్యమ వాతావరణం తదితర పరిణామాల దృష్ట్యా నిర్లక్ష్యం కొనసాగింది. ఇంచుమించు 2017 వరకు ఆర్టీఏ కార్యాలయాల్లోనే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి నంబర్ ప్లేట్‌లను బిగించారు. కానీ.. అప్పటికే లక్షలాది వాహనాలు పెండింగ్‌లో ఉండడంతో హెచ్‌ఎస్ఆర్‌పీ నిర్వహణ సవాలుగా మారింది. ఆ తర్వాత ఈ పథకాన్ని షోరూమ్‌లకు బదిలీ చేశారు. బండి కొనుగోలు సమయంలోనే హెచ్‌ఎస్ఆర్‌పీ కోసం ఫీజు చెల్లించడం తప్పనిసరి చేశారు.

- షోరూమ్‌లకు బదిలీ అయిన తర్వాత కొంత మేరకు బాగానే అమలైంది. కానీ.. నంబర్ ప్లేట్ సహా శాశ్వత రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా చెల్లించినప్పటికీ కొందరు వాహనదారులు హెచ్‌ఎస్ఆర్‌పీని ఏర్పాటు చేసుకోలేదు. తమకు నచ్చిన పద్ధతిలో బయట తయారు చేసుకొని అమర్చుకున్నారు. ఇలాంటి వాహనాలు కనీసం 20 లక్షలకు పైగా ఉండవచ్చని అంచనా. కార్లు, లగ్జరీ వాహనాలు, హై ఎండ్ బండ్లకు ఆకర్షణీయమైన పద్ధతిలో నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకునేందుకు హెచ్‌ఎస్ఆర్‌పీని విస్మరించారు. సుమారు 12 లక్షల ద్విచక్ర వాహనాలు, 5 లక్షల కార్లు, సుమారు 2 లక్షల వరకు క్యాబ్‌లు, ఇతర రవాణా వాహనాలు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

నాణ్యతపై నమ్మకం లేకనే..

- హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లలో నాణ్యత లేకపోవడంతోనూ వాహనదారులు విముఖత చూపుతున్నారు. తెలుపు రంగు ప్లేట్లపై నంబర్లను ఎంబోసింగ్ చేసి నలుపురంగు పెయింట్ వేస్తారు. కాగా.. ఈ రంగు ఎక్కువ కాలం ఉండడం లేదు.
- ప్లేట్లు సైతం నాసిరకం కారణంగా త్వరగా దెబ్బ తింటున్నాయి. సొట్టలు పడుతున్నాయి. విరిగి ముక్కలవుతున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.
- నంబర్ ప్లేట్లు ఆకర్షణీయంగా లేకపోవడం కూడా మరో కారణం. రూ.లక్షల ఖరీదైన వాహనాలు కొనుగోలు చేసి ఇలాంటి నాసిరకం ప్లేట్లు అమర్చుకొనేందుకు ఆసక్తి కనబర్చడం లేదు.

ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు..

- సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రస్తుతం పాత, కొత్త వాహనాలకు హెచ్‌ఎస్ఆర్‌పీ అనివార్యమైంది.
- మరోవైపు హెచ్‌ఎస్ఆర్‌పీ లేని వాహనాలకు అన్ని రకాల పౌరసేవలను నిలిపివేయనున్నట్లు ఆర్టీఏ హెచ్చరిస్తోంది.
- ఈ క్రమంలో పాత వాహనాలకు ఏర్పాటు చేసుకొనేందుకు వాహనదారులు సయామ్ (ఎస్ఐఏఎం) వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొనే సదుపాయం ఉంది.
- ఈ పోర్టల్‌లో తమ సమీపంలోని షోరూమ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.
- నమోదైన స్లాట్ ప్రకారం వెళ్లి నంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.
- కొత్తవాహనాలకు మాత్రం బండి రిజిస్ట్రేషన్ సమయంలోనే ప్లేట్లను బిగిస్తారు.

నిఘా నీడలో..



నేడు వీర హనుమాన్ విజయ యాత్ర

- 17 వేల మంది పోలీసులతో బందోబస్తు

సుల్తాన్‌బజార్: వీర హనుమాన్ విజయ యాత్రకు అంతా సిద్ధమైంది. గౌలిగూడ రాంమందిర్ నుంచి తాడ్‌బండ్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగనున్న బైక్ ర్యాలీకి వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ 17వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉదయం 8 గంటలకు గౌలిగూడ రాంమందిర్‌లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యజ్ఞంతో యాత్ర ప్రారంభం కానుంది.

కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాలో బహిరంగ సభ..

ర్యాలీలో దాదాపు 2 లక్షల మంది హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీగా తరలివచ్చే వారిని ఉద్దేశించి కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ తలపెట్టారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విశ్వహిందూ పరిషత్ నేత, పార్లమెంట్ మాజీ సభ్యుడు రామ్‌విలాస్ దాస్ వేదాన్ పాల్గొంటారు.

శోభా యాత్ర రూట్ ఇలా..

వీర హనుమాన్ విజయయాత్ర ఉదయం 8 గం టలకు యజ్ఞంతో ప్రారంభమై వివిధ శకటాలతో గౌలిగూడ రాంమందిర్ నుంచి కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా, సుల్తాన్‌బజార్ చౌరస్తా, రాంకోఠి క్రాస్‌రోడ్, కాచిగూడ క్రాస్‌రోడ్, వైఎంసీఏ మీదుగా నారాయణగూడ ఫ్లైఓవర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ అశోక్‌నగర్ క్రాస్‌రోడ్, గాంధీనగర్, బన్సీలాల్‌పేట్ జంక్షన్, బైబిల్ హౌస్, బాటా, రాంగోపాల్‌పేట్, సీటీఓ జంక్షన్, రాయల్ ప్యాలెస్ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు సాగుతుంది.

బల్దియా చరిత్రలోనే భారీ రికార్డు

సమష్టికృషితో అత్యధికంగా ఆస్తి పన్ను వసూలు: ఇలంబర్తి



చీఫ్ వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణికి ప్రశంస పత్రం అందజేస్తున్న కమిషనర్ ఇలంబర్తి

బంజారాహిల్స్: ఆస్తి పన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రికార్డు స్థాయిలో అద్భుతమైన వసూళ్లను సాధించి చరిత్ర సృష్టించిందని కమిషనర్ ఇలంబర్తి అన్నారు. రూ.2 వేల కోట్లకు పైగా ఆస్తి పన్ను వసూలు చేయడంలో క్షేత్ర స్థాయి అధికారులు బాగా పని చేశారన్నారు. జీహెచ్ఎంసీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలైన నేపథ్యంలో.. అందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంసీలు, డిప్యూటీ కమిషనర్లకు శుక్రవారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ వసూలు కానంతగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం లక్ష్యాన్ని మించి పన్ను వసూలు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పన్ను వసూలు ఎంత ఎక్కువ వస్తే ప్రజలకు అంత బాగా సేవలు అందించే వీలుంటుందన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అమలుతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రూ.121 కోట్లకు పైగా ఆస్తి పన్ను అదనంగా వసూలైందన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను రూ.1,917 కోట్లు వసూలు కాగా, 2024–25 ఆర్థిక సంవత్సరం రూ.2,038 కోట్లకుపైగా వసూలయ్యాయని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్లు లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, వేణుగోపాల్‌రెడ్డి, రఘుప్రసాద్, వేణుగోపాల్, సామ్రాట్ అశోక్, సరోజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, ఉపేందర్‌రెడ్డి, రవికిరణ్, వెంకన్న, సీసీపీ శ్రీనివాస్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, డిప్యూటీ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టరుల, ఏఎంసీలు, బిల్ కలెక్టర్లు, ఐటీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి, తదితరులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా విప్లవానికి మార్గదర్శిగా నిలిచారని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాలకు విద్య, స్వాభిమానం అందించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమైందన్నారు. సమాజ మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని దారి చూపించిన మహనీయుడన్నారు. మహిళలు, దళితులు, అణగారిన వర్గాలకు విద్య అందించాలనే దృఢ సంకల్పంతో ఆయన స్థాపించిన తొలి బాలికల పాఠశాల భారతీయ సమాజ పునర్నిర్మాణానికి మైలురాయిగా నిలిచిందన్నారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. పూలే.. మహిళా విద్యకు పునాదులు వేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, చీఫ్ ఇంజినీర్ రత్నాకర్, సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజా అలీ తదితరులు పాల్గొన్నారు.



పుష్పాంజలి ఘటిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

ఆకస్మికంగా కారు డోర్ తెరిచిన డ్రైవర్

దానిని ఢీకొని దుర్మరణం పాలైన ద్విచక్ర వాహనదారు



మృతుడు వీరాచారి (ఫైల్)

ఘట్‌కేసర్: వెనక వైపు నుంచి ఎవరు వస్తున్నారో చూసుకోకుండా డ్రైవర్ కారు డోర్ తెరవడంతో.. దానిని ఢీకొని ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలైన విషాదకర ఘటన శుక్రవారం ఘట్‌కేసర్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్‌నకు చెందిన సామల వీరాచారి (45) వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం ఘట్‌కేసర్‌లో పనులు ముగించుకొని బైక్‌పై అవుషాపూర్‌కు వెళ్తున్నాడు. హెచ్‌పీసీఎల్ వద్దకు చేరుకోగానే.. కారును ఆపి డ్రైవర్ ఎటువంటి సూచనలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా దాని డోర్ తెరిచాడు. ఈ క్రమంలో అదే వైపు బైక్‌పై వెళుతున్న వీరాచారి ఊహించని పరిణామంతో నియంత్రణ కోల్పోయి కారు డోర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడి తల, చేతులు, ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు బాధితుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వీరాచారి అప్పటికే మరణించినట్లు చెప్పారు. మృతుడి బావమరిది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో కదంతొక్కిన కాంట్రాక్టు అధ్యాపకులు


ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు కదంతొక్కారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ నుంచి పాలన భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. వర్సిటీలలో అధ్యాపక నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టు అధ్యాపకులు అప్రమత్త మయ్యారు. గత నాలుగు రోజులుగా వరుసగా ఆందోళనలు చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని రాష్ట్రంలోని శుక్రవారం అన్ని వర్సిటీలలో తరగతులను బహిష్కరించి ర్యాలీ చేపట్టారు. తక్కువ వేతనంతో గత 27 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, 3 శాతం ఇంక్రిమెంట్‌తో కూడిన వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇక నో సిల్ట్ !



జవహర్‌నగర్‌కు తరలించడం కుదరదు ● ఏ జోన్‌లోని సిల్ట్.. ఆ జోన్‌లోనే

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఘనవ్యర్థాల నిర్వహణపై అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని చెత్తనంతా తరలిస్తున్న జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకే ప్రతియేటా నాలాల్లోంచి తీసిన సిల్ట్ (పూడిక)ను కూడా తరలిస్తుండటంతో, ఇకపై అలా కుదరదని సంబంధిత నిర్వహణ విభాగం ఇంజినీర్లకు స్పష్టం చేశారు. ప్రస్తుతం రోజుకు సగటున దాదాపు 7,500 మెట్రిక్ టన్నుల చెత్త జవహర్‌నగర్‌కు చేరుతోందని వారు చెబుతున్నారు. ఇప్పటికే అక్కడ పేరుకుపోయిన చెత్తతో ల్యాండ్‌ఫిల్ స్థలం లేకుండా పోతోంది. దానికి తోడు సిల్ట్‌ను కూడా అక్కడికే తరలిస్తే మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయంటూ ఏ జోన్‌లోని సిల్ట్‌ను ఆ జోన్‌లోనే తరలించేందుకు తగిన స్థలాలు చూసుకోవాల్సిందిగా స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని చెప్పడంతో అందుకు రెండు మూడు నెలల సమయం మాత్రం ఇస్తామని, ఆలోగా మీ ఏర్పాట్లు మీరు చేసుకోవాల్సిందిగా సూచించినట్లు సమాచారం.

పేరుకు సిల్ట్..

సిల్ట్ పేరిట బరువు ఎక్కువగా చూపేందుకు నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు (సీ అండ్ డీ వేస్ట్)సైతం కలిపి జవహర్‌నగర్‌కు తరలుతున్నట్లు గుర్తించారు. దాంతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని రెండు మూడు నెలల్లో సైతం సిల్ట్‌తో పాటు సీఅండ్‌డీ వేస్ట్ వస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం.

భారమవుతున్న చెత్త నిర్వహణ..

ప్రస్తుతం నగరంలోని చెత్తనంతా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకే తరలిస్తుండటంతో అక్కడ సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి నగరానికి నాలుగువైపులా చెత్త నిర్వహణకేంద్రాలు ఏర్పాటు చేయాలనుకున్నా పలు అవాంతరాలు ఎదురవుతున్నాయి. స్థల సేకరణే తీవ్ర సమస్యగా మారగా, స్థలం సేకరించిన సంగారెడ్డి జిల్లాలోని ప్యారానగర్‌లో చెత్త నిర్వహణ కేంద్రానికి స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తం కావడంతో దానికి ఆటంకాలేర్పడ్డాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న చెత్తకు తోడు సిల్ట్.. దాని పేరిట సీఅండ్‌డీ వేస్ట్ వ్యర్థాలు కలగలిపి తరలిస్తుండటంతో, ఇక కుదరదని ఘనవ్యర్థాల నిర్వహణ అధికారులు కరాఖండిగా తేల్చి చెప్పినట్లు తెలిసింది.

ఏం చేస్తారో ?

అందుకు సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ మెయింటెనెన్స్ ఇంజినీర్లు ఏం చేయనున్నారో వేచి చూడాల్సిందే. ఈ సంవత్సరం పూడిక తీత పనులు ఇంకా పూర్తికాలేదు. ఈ పాటికే పనులు ముమ్మరం కావాల్సి ఉండగా, కొన్ని చోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. వేసవి లోగా సిల్ట్ తీయాలని ప్రతియేటా చెబుతున్నా అది సాధ్యం కావడం లేదు.

ఈ సంవత్సరం సిల్ట్‌కు సంబంధించిన పనుల వివరాలు జీహెచ్ఎంసీ జోన్ల వారీగా..

జోన్	పనులు	అంచనా వ్యయం (రూ.లక్షలు)
ఎల్బీ నగర్	5	540.74
చార్మినార్	85	1759.10
ఖైరతాబాద్	61	1124.48
శేరిలింగంపల్లి	7	810.50
కూకట్‌పల్లి	6	638.90
సికింద్రాబాద్	39	630.35
మొత్తం	203	5504.07

◆ వీటిల్లో రూ.50.58 కోట్ల విలువైన 182 పనులు కొనసాగుతున్నాయని,మిగతా 21 పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

నగరంలో నేడు

◆ మాదాపూర్‌లోని పత్రికానగరంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సైన్స్ పార్కు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

◆ మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫుడ్ ఇండియా ఎక్స్‌పో–2025 జరుగుతుంది.

◆ తెలంగాణ 3ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో 3ఏ సైడ్ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్ 2025 వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుంది.

'పూలే' సినిమాను అడ్డుకోవడం దారుణం: కంచ ఐలయ్య

లక్డీకాపూల్: జ్యోతిరావ్ పూలే, సావిత్రీబాయి పూలే వంటి మహానీయుల జీవితాలపై రూపొందించిన హిందీ సినిమాను ఎవరో అభ్యంతరం వ్యక్తం చేశారని సెన్సార్ బోర్డు అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని కంచ ఐలయ్య షఫర్డ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక సామాజిక సమూహం వ్యతిరేకిస్తోందనే సాకుతో చరిత్ర ఆధారంగా తీసుకున్న ఒక చిత్రాన్ని ఆపడం అన్యాయం అన్నారు. పూలే దంపతుల పోరాటం అనేది అప్పటి కుల వ్యవస్థను వ్యతిరేకించినదే అన్నారు.

45 రోజుల్లో 1,060 ఫోన్ల రికవరీ



సాక్షి, సిటీబ్యూరో: చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా సులభతరమైంది. గత 45 రోజుల్లో సైబరాబాద్ పోలీసులు 1,060 ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ రూ.3.18 కోట్లు. ఆయా మొబైల్స్‌ను శుక్రవారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో బాధితులకు డీసీపీ (క్రైమ్స్) ఎలీసీ నాయక్ అప్పగించారు. అత్యధికంగా మాదాపూర్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు 245 ఫోన్లను రికవరీ చేశారని, ఆ తర్వాత బాలానగర్ సీసీఎస్ 225, రాజేంద్రనగర్ సీసీఎస్ 205, మేడ్చల్ సీసీఎస్ 200, శంషాబాద్ సీసీఎస్ 185 ఫోన్లను రికవరీ చేశారని డీసీపీ తెలిపారు.

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌కు షోకాజ్ నోటీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ)లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జేఐసీ సెక్రటరీకి నోటీసులు జారీ చేసిన అధికారులు అక్రమంగా నిర్మించిన కట్టడాలపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరారు. జనవరి 29వ తేదీన ఇచ్చిన షోకాజ్ నోటీసుకు ఇంతవరకు వివరణ ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. జేఐసీలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేవని, వీటిపై చర్యలు తీసుకోవాలంటూ కొంతకాలంగా క్లబ్‌కు చెందిన సభ్యుడు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. అయితే కిచెన్‌కు సంబంధించిన మరమ్మతులు చేపడుతున్నామని, కొత్త నిర్మాణాలు చేపట్టడం లేదని క్లబ్ సెక్రటరీ పేర్కొంటుండగా, ఇక్కడ మాత్రం కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారని, వీటికి అనుమతులు లేవని కొందరు ఆరోపిస్తున్నారు. దీనిపై కొంతకాలంగా వివాదం నెలకొంది. క్లబ్‌లో నిర్మాణం జరుపుకుంటున్న కట్టడాలను ఫోటోలు తీసేందుకు యత్నిస్తున్నారంటూ ఇటీవలనే ట్రెస్పాస్ కేసు కూడా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. ఈ నేపథ్యంలో జేఐసీలో నిర్మాణాల పట్ల తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిర్మాణాలు జరపడం లేదని క్లబ్ యాజమాన్యం, జరుపుతున్నారంటూ మరికొందరు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వీధి వ్యాపారులకు చట్టపరమైన గుర్తింపు: మేయర్

లక్డీకాపూల్: నగరంలోని వీధి వ్యాపారులకు చట్టపరమైన గుర్తింపునకు కృషి చేయనున్నట్టు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. వారి హక్కులు, వృత్తి స్వాతంత్ర్యం, జీవనోపాధి భద్రతతో పాటుగా వాణిజ్య నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. శనివారం మేయర్ జాతీయ హాకర్స్ ఫెడరేషన్ (ఎన్‌హెచ్ఎఫ్) ప్రతినిధులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వీధి వ్యాపారులతో సంబంధిత అనేక ముఖ్య అంశాలపై లోతుగా చర్చించారు. ప్రత్యేకంగా ఈ సమావేశానికి ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌హెచ్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శక్తిమాన్ ఘోష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలలో 1,500కిపైగా అనుబంధ సంఘాలు, 20 లక్షలమందికి పైగా వీధి వ్యాపారాలను చేసుకుంటున్నట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. ఈ మేరకు మేయర్ వీధి వ్యాపారుల సంక్షేమం కోసం అధికారులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. వీధి వ్యాపారులు కూడా నగర అభివృద్ధిలో భాగస్వాములే కాబట్టి, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు సమాధానాలు కనుగొనే దిశగా నడవాల్సిన అవసరం ఉందన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

రాచకొండ సీపీ సుధీర్ బాబు


నాగారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

కీసర: నేర నియంత్రణతో పాటు నేరస్తులకు శిక్ష పడేలా చేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. కమిషనరేట్‌లోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన 1460 సీసీ కెమెరాలను నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్‌లో ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మల్కాజిగిరి జోన్ పరిధిలో మొత్తం 1460 కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇందులో 410 కెమెరాలను 17 కాలనీల్లో, ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద ఏర్పాటు చేశామన్నారు. వీటి కోసం రూ.1.19 కోట్లు ఖర్చు చేశామని, రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా సంబంధిత కాంట్రాక్టర్‌దేనని చెప్పారు. మిగిలిన 1050 కెమెరాలను 212 దేవాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు 5260 కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, 93,061 నేను సైతం కెమెరాలు కలిసి మొత్తం 98,321 కెమెరాలను జియో ట్యాగింగ్ చేశామన్నారు. వీటన్నిటినీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక బృందం నిరంతరం పరిశీలిస్తుందన్నారు. భద్రత, సురక్షితమే ధ్యేయంగా నిఘా నేత్రాలను ఆవిష్కరిస్తున్నామన్నారు. కోర్టులకు సాక్ష్యాధారాలను సమర్పించవలసి వచ్చినప్పుడు కెమెరాలు కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పోలీస్ కమిషనరేట్‌గా మల్కాజిగిరి రాచకొండ కమిషనరేట్ ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ పద్మజ, అదనపు డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, కుషాయిగూడ ఏసీపీ మహేష్ గౌడ్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రి ఉద్యోగి ఆత్మహత్య


మెహరాజ్ ఆలం(ఫైల్)

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆసుపత్రి ఉద్యోగి ఒకరు అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. యాజమాన్యం సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం బెంగాల్‌కు చెందిన మెహరాజ్ ఆలమ్ (24) ఎస్ఎల్‌జీ ఆసుపత్రిలో గత నాలుగేళ్లుగా నర్సింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలలుగా వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురైన మెహరాజ్ ఆలం శుక్రవారం అధిక మొత్తంలో మత్తు ఇంజెక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీన్ని తోటి సిబ్బంది గమనించి వెంటనే చికిత్స అందించేందుకు ప్రయత్నించినా పరిస్థితి విషమించి..మెహరాజ్ అక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడినట్లు సన్నిహితులు పేర్కొంటున్నారు. కాగా ఈ విషయన్ని వెలుగులోకి రాకుండా ఆసుపత్రి యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. తీరా బయటకు పొక్కడంతో పోలీసులు మేహరాజ్ రూంలో ఉంటున్న వ్యక్తి నుంచి ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఎల్‌జీ యాజమాన్యం ప్రతి నెలా కార్మికులు, కిందిస్థాయి ఉద్యోగులకు, డాక్టర్లకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఇటీవల సుమారు 100 మంది కార్మికులు ఈ విషయంపై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం వచ్చారు. అనంతరం కార్మిక శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఐపీఎల్ కాంప్లిమెంటరీ పాసుల వ్యవహారంపై డీజీ విచారణ

ఉప్పల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో గత కొన్ని రోజులుగా రగులుతున్న కాంప్లిమెంటరీ పాసుల జారీ వ్యవహారంపై ఆరా తీయడానికి శుక్రవారం విజిలెన్స్ డీజీ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి ఉప్పల్ స్టేడియానికి వచ్చారు. అసోసియేషన్ సెక్రటరీ దేవ్‌రాజ్, ట్రెజరర్ శ్రీనివాస్‌లను టికెట్ల విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. శనివారం ఐపీఎల్ మ్యాచ్ ఉండటంతో టికెట్ల పంపకం ప్రక్రియను ఎలా చేపట్టారన్న వివరాలను ఆయన సేకరించారు. టికెట్ల పంపిణీ విషయమై సెక్రటరీ, ట్రెజరర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చిన సంగతి విదితమే. సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి వచ్చే ప్రతి కాంప్లమెంటరీ టికెట్ మొదటగా చేరుకునేది వీళ్లిద్దరి వద్దకే కాబట్టి..వీరి వద్ద నుంచే టికెట్లు పక్కదారి పట్టినట్లుగా విజిలెన్స్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. స్టేడియంలో కారు, బైకు పాస్‌లను తమ సొంత మనుషులకే వీరు అందజేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఒప్పందం ప్రకారం 10 శాతం కాంప్లిమెంటరీ టికెట్లు హెచ్‌సీఏకు వస్తున్నా..ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యమే తక్కువ ఇస్తున్నట్లుగా ప్రచారం చేసి టికెట్లను పూర్తిగా తమ వారికే ఇస్తున్నట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ఈ సందర్భంగా సెక్రటరీ మాత్రం రాచకొండ పోలీసులే ఎక్కువగా టికెట్లను తీసుకున్నట్లు ప్రచారం చేశారని గుర్తించినట్లు తెలిసింది.

వెల్లివిరిసిన ఉత్సాహం

● ఘనంగా ఉస్మానియా మెడికల్ కళాశాల స్నాతకోత్సవం
● హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ



సుల్తాన్‌బజార్: ఉస్మానియా అంటేనే అంతర్జాతీయ బ్రాండ్ అని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం రాత్రి ఉస్మానియా వైద్య కళాశాల ఆవరణలో 2019 బ్యాచ్ స్నాతకోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు మంత్రి దామోదర చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థిగా చేరి..ఓ డాక్టర్‌గా ఎంబీబీఎస్ పట్టా అందుకున్న రోజు ఆ వ్యక్తి జీవితంలో మరువలేనిదన్నారు. తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చే సందర్భం ఇదే నన్నారు. వైద్యవృత్తి అనేది ఓ ప్యాషన్‌తో కూడిన కమిట్‌మెంట్ అన్నారు. రూ.100 కోట్లతో ఉస్మానియా హాస్టల్ బిల్డింగ్‌ను తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గోషామహల్‌లో రూ.2007 కోట్ల వ్యయంతో 26 ఎకరాల్లో 2 వేల బెడ్స్‌తో కూడిన మంచి మౌళిక సదుపాయాలు గల ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్‌తో పాటు ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణ 4వ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడిగా గంగాధర్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ 4వ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షులుగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 31వ తేదీన సంఘం అధ్యక్షులుగా ఉన్న గడ్డం జ్ఞానేశ్వర్ పదవీ విరమణ పొందడంతో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో వివిధ జిల్లాల అధ్యక్షులు గంగాధర్‌ను రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ 4వ తరగతి ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరేలా కృషి చేస్తానని చెప్పారు.

ఈ నెల 14న జూ పార్క్ ఓపెన్

చార్మినార్: ఈ నెల 14వ తేదీన నెహ్రూ జూలాజికల్ పార్క్ తెరిచే ఉంటుందని సంబంధిత క్యూరేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యోత్సవాలను పురస్కరించుకొని సందర్శకుల సౌకర్యార్థం సోమవారం జూ పార్క్ తెరిచే ఉంటుందన్నారు. సాధారణంగా వారంలో ఒకరోజు అంటే సోమవారం జూ పార్కు మూసి ఉంటుందని.. అయితే ఈ సోమవారం సందర్శకుల కోసం తెరిచి ఉంటుందన్నారు.

సామాజిక న్యాయం కోసం పూలే పోరాటం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



రహమత్‌నగర్: సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం మహాత్మ జ్యోతిరావు పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఎస్ఆర్‌హిల్స్‌లోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్)లో శుక్రవారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. తాడిత పీడిత ప్రజానీకం కోసం పూలే ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూలే చూపిన మార్గంలో పయనిస్తుందని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్



చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్ గ్రౌండ్) ఎం.రాజును సస్పెండ్ చేశారు. పరిపాలన విధుల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.

పూలేకు కలెక్టర్ నివాళి

లక్డీకాపూల్: అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధారణ, కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం అవిశ్రాంతంగా పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పూలే 198వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
12-04-2025

ఇల్లు ఆఫీసు షాపింగ్

- మెట్రో నగరాల్లో మిశ్రమ వినియోగ భవనాలు
- ఆయా నిర్మాణాల్లో రిటైల్ స్పేస్‌కు డిమాండ్
- 2025 క్యూ1లో దేశంలో 24 లక్షల చ.అ. లావాదేవీలు
- అత్యధికంగా హైదరాబాద్‌లోనే 34 శాతం లీజులు
- గ్రేటర్‌లో 8 లక్షల చ.అ. రిటైల్ స్థల లావాదేవీలు
- మన తర్వాతే ముంబై, ఎన్‌సీఆర్ నగరాలు
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అధ్యయనం వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో నగరాలలో సంప్రదాయ షాపింగ్ మాల్స్‌కు కాలం చెల్లింది. ఇల్లు, ఆఫీసు, మాల్ అన్నీ ఒకే చోట ఉండే మిశ్రమ వినియోగ భవనాలు ఊపందుకుంటున్నాయి. నగరవాసులు నివాసం ఉండే చోటుకు సమీపంలోనే కార్యాలయం, వారాంతాల్లో కుటుంబంతో కలిసి ఆనందంగా గడిపేందుకు షాపింగ్ మాల్ కూడా దగ్గర్లోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లు, ఆఫీసు స్పేస్‌తో పాటు రిటైల్ స్పేస్ అందుబాటులో ఉండే మిశ్రమ భవనాలకు డిమాండ్ పెరిగింది.

- ఈ ఏడాది జనవరి–మార్చి (క్యూ1)లో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 24 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లావాదేవీలు జరిగాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అధ్యయనం వెల్లడించింది. ఏడాది కాలంలో 55 శాతం వృద్ధి రేటు నమోదైంది. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో మాల్స్, రిటైల్ సరఫరా పెరగడమే లావాదేవీల వృద్ధికి ప్రధాన కారణం. ఈ ఏడాది వచ్చే మూడు త్రైమాసికాల్లో కొత్తగా 70 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తుందని అంచనా వేసింది.

అత్యధికంగా గ్రేటర్‌లోనే..

గృహాలు, కార్యాలయాల విభాగంలోనే కాదు రిటైల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ దూసుకెళుతోంది. 2025 క్యూ1లో జరిగిన లావాదేవీల్లో అత్యధికంగా 34 శాతం వాటా మన గ్రేటర్‌దే. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో నగరంలో 8 లక్షల రిటైల్ స్థల లావాదేవీలు జరిగాయి. ఏడాది కాలంతో పోలిస్తే ఇది 106 శాతం ఎక్కువ. హైదరాబాద్ తర్వాత అత్యధికం రిటైల్ స్పేస్ లావాదేవీలు ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాల్లో జరిగాయి. 2025 క్యూ1లో దేశంలో జరిగిన మొత్తం రిటైల్ స్థల లీజుల్లో ముంబై 24 శాతం, ఢిల్లీ–ఎన్‌సీఆర్ 17 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. ఆర్థిక రాజధాని(ముంబై)లో 5.8 లక్షల చ.అ., దేశ రాజధానిలో 4.1 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి.

హైస్ట్రీట్‌కు డిమాండ్

గ్రేటర్‌లో హైస్ట్రీట్ ప్రాంతాల్లోని రిటైల్ స్పేస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. నగరంలో జరిగిన లీజు లావాదేవీల్లో హైస్ట్రీట్ వాటా 90 శాతంగా ఉంది. కొత్తపేట, నల్లగండ్ల, కొంపల్లి వంటి ప్రాంతాల్లో అత్యధిక లావాదేవీలు జరిగాయి. ఒక్క జూబ్లీహిల్స్‌లోనే ఏకంగా 24 శాతం లావాదేవీల వాటా కలిగి ఉంది. జూబ్లీహిల్స్‌లో రిటైల్ స్పేస్ అద్దెలు ఏటా 13.6 శాతం పెరుగుతున్నాయి. షాపింగ్ మాల్స్‌లో మాత్రం అద్దెలు స్థిరంగా ఉన్నాయి. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, టోలిచౌకీ ప్రాంతాలలో కొత్త ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణలతో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయి. సూక్ష్మ మార్కెట్లతో కనెక్టివిటీ పెరగడంతో ఆయా ప్రాంతాలలో రిటైల్ స్టోర్లు, స్థలాలకు ఆదరణ పెరిగింది.

దేశీయ బ్రాండ్లదే హవా..

ఫ్యాషన్, వెల్‌నెస్, ఫుడ్ అండ్ బేవరేజెస్ విభాగాలు ఎక్కువగా రిటైల్ స్పేస్‌ను లీజుకు తీసుకుంటున్నాయి. లీజు లావాదేవీల్లో దేశీయ బ్రాండ్ల వాటా ఏకంగా 98 శాతంగా ఉంది. ఫ్యాషన్ విభాగం 27 శాతం, వెల్‌నెస్ 19 శాతం, ఫుడ్ అండ్ బేవరేజెస్ 16 శాతం లీజు వాటాలను కలిగి ఉన్నాయి.



ఐఓటీ గృహాలు!

డిజిటల్ తాళాలు, స్మార్ట్ కెమెరాలు, వీడియో డోర్ బెల్స్

నగరంలో పెరుగుతున్న ఐఓటీ ఆధారిత పరికరాల వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: కరోనా తర్వాత ఇంటి స్వరూపం మారిపోయింది. ఇంటిలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారిత భద్రతా ఉపకరణాల వినియోగం పెరిగింది. రియల్ టైమ్‌లో ట్రాక్ చేసే స్మార్ట్ కెమెరాలు, డిజిటల్ లాక్స్, స్మార్ట్ వీడియో డోర్ బెల్స్, లైట్లు, కర్టెన్లు ప్రతిదీ స్మార్ట్‌గా మారిపోయాయి. వేలిముద్ర, ఐరిష్ చూపిస్తే చాలు ఆటోమెటిక్‌గా ఇంటి తలుపులు తెరుచుకుంటాయి. ఇంట్లో మనం లేకపోయినా ఎవరైనా అతిథులొస్తే ఫోన్‌లో నుంచే గుమ్మం తెరిచి స్వాగతం పలకొచ్చు. గదిలోకి రాగానే లైట్లు వాటంతటవే ఆన్, ఆఫ్ అవుతుండటం వంటి ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

- చాలా మంది బిల్డర్లు ఇంటి నిర్మాణ సమయంలోనే ఈ స్మార్ట్ ఉపకరణాలను జోడిస్తున్నారు. కోకాపేట, మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్‌లోని హైఎండ్ ప్రాజెక్ట్‌లలో ఈ తరహా ఐఓటీ ఉపకరణాల ప్రాజెక్ట్‌లు ఎక్కువగా నిర్మాణంలో ఉన్నాయి. వృద్ధులు, చిన్న పిల్లలు ఉండే వారు వ్యక్తిగత గృహాలలో సైతం వీటిని ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరిగా మారింది.



సొంతింటికే.. 25% సంపాదన!

సాక్షి, సిటీబ్యూరో: మన దేశంలో అత్యంత ధనవంతులు తమ సంపదలో 22–25 శాతం మొత్తాన్ని తాము ఉండాలనుకుంటున్న ఇంటి కొనుగోలుకే వెచ్చిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా సర్వే వెల్లడించింది. రూ.కోటి కంటే ఎక్కువ ఆదాయం కలిగిన 18–35 ఏళ్ల వయస్సు గల వారిలో 89 శాతం మంది సంపన్న భారతీయులు తమ ప్రాపర్టీని అద్దెకు ఇవ్వడంకంటే అందులో తాము ఉండటానికే మొగ్గు చూపిస్తున్నారు. కోటి డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు కలిగిన భారతీయ అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు తమ సంపదలో 22–25 శాతాన్ని తాము నివసించాలనుకునే ప్రధాన ఇంటికి కేటాయిస్తున్నారని, వారి హోల్డింగ్స్‌లో 80–90 శాతం దేశంలోనే కేంద్రీకృతమై ఉన్నాయని నివేదిక వెల్లడించింది.

- దేశంలో అధిక నికర విలువ కలిగిన వ్యక్తుల సంఖ్య 2024లో 6 శాతం మేర పెరిగి 80,686 నుంచి 85,698కు చేరుకుందని, బిలియనీర్ల సంఖ్య 191కు పెరిగిందని వెల్త్ రిపోర్ట్ వెల్లడించింది. 2028 నాటికి వారి సంఖ్య 93,753కు పెరుగుతుందని అంచనా. హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) పెట్టుబడుల్లో ఎక్కువ భాగం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నైలకే వస్తున్నాయి. విదేశీ పెట్టుబడుల విషయానికొస్తే.. ఎక్కువ మంది హెచ్‌ఎన్‌ఐలు యూఏఈ, యూకే వంటి దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని నైట్‌ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 47 శాతం మంది లగ్జరీ కార్లలో పెట్టుబడులకు, 28 శాతం మంది హైఎండ్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.






రూ. 50 కోట్ల ఇల్లయినా.. తగ్గేదేలే!

ఇంటి బడ్జెట్ అంటే లెక్కేలేదు. ఒకటి, రెండు కాదు ఏకంగా రూ.50 కోట్లయినా సునాయాసంగా ఖర్చు చేసేస్తున్నారు. గతంలో ఇల్లు కొనాలంటే బడ్జెట్‌ను ప్రధానంగా పరిగణలోకి తీసుకునేవారు. కానీ, ఇప్పుడు ఎంత ఖరీదైన ఇళ్లయితే అంత గొప్ప. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగానే డెవలపర్లు కూడా ప్రీమియం, అల్ట్రా లగ్జరీ గృహాలను నిర్మిస్తున్నారు. ఏటేటా అందుబాటు గృహాల విక్రయాలు తగ్గుతూ.. అల్ట్రా లగ్జరీ ఇళ్ల అమ్మకాలు పెరుగుతుండటమే ఇందుకు ఉదాహరణ.
– సాక్షి, సిటీబ్యూరో



ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో గణనీయమైన వృద్ధి



- ఏడాదిలో 483 శాతం వృద్ధి రేటు నమోదు
- హైదరాబాద్‌లో 9,459 గృహాల అమ్మకాలు
- నగరంలో 10,661 యూనిట్లు లాంచింగ్
- 40 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా–2025 క్యూ1 అధ్యయనం

ఏటేటా రూ.50 లక్షలలోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాల విక్రయాలు తగ్గుతున్నాయి. వీటి స్థానంలో రూ.50 కోట్ల కంటే ఎక్కువ ధర ఉండే అల్ట్రా లగ్జరీ యూనిట్ల అమ్మకాలు శరవేగంగా పెరుగుతున్నాయి. 2025 జనవరి–మార్చి(క్యూ1)లో అమ్ముడైన ఇళ్లలో అందుబాటు గృహాలు 21,010గా ఉన్నాయి కానీ, గతేడాది క్యూ1తో పోలిస్తే ఈ విభాగంలో సేల్స్ 9 శాతం మేర తగ్గాయి. అదే 2025 క్యూ1లో 169 అల్ట్రా లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోగా.. గతేడాది క్యూ1తో పోలిస్తే ఏకంగా 483 శాతం వృద్ధి నమోదైంది. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉండే ఇళ్లు 26,832 సేల్ కాగా.. 2024 తొలి త్రైమాసికంతో పోలిస్తే 6 శాతం తక్కువ. ఇక, రూ.కోటి నుంచి రూ.2 కోట్ల ధర ఉండే యూనిట్లు 2 శాతం వృద్ధి రేటుతో 22,230 అమ్ముడుపోయాయి. రూ.2–5 కోట్ల ధర ఉండే ఇళ్లు 28 శాతం వృద్ధితో 13,735 సేల్ అయ్యాయి. అలాగే రూ.5–10 కోట్లు ధర ఉండే గృహాలు 82 శాతం పెరుగుదలతో 3,448 సేల్ అయ్యాయి. రూ.10–20 కోట్లు ఖరీదు చేసే యూనిట్లు 114 శాతం వృద్ధి రేటుతో 658 అమ్ముడయ్యాయి. అలాగే రూ.20–50 కోట్ల ధర ఉండే ప్రీమియం ఇళ్లు 124 శాతం వృద్ధితో 92 యూనిట్లు అమ్ముడుపోయాయి.



ఆఫీసు స్పేస్ అధరహో..



దేశంలోని 8 ప్రధాన నగరాలలో 2025 క్యూ1లో 2.82 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. ఇందులో అత్యధికంగా 44 శాతం వాటా గ్లోబల్ కేపబులిటీ సెంటర్లదే(జీసీసీ). 2025 క్యూ1లో జరిగిన లీజుల్లో అత్యధికంగా 1.24 కోట్ల చ.అ. స్థలాలు జీసీసీల ఏర్పాటు కోసమే జరగడం గమనార్హం. ఆఫీసు స్పేస్‌లలో ఐటీ హబ్‌లైన బెంగళూరు, హైదరాబాద్ తీవ్రంగా పోటీపడుతున్నాయి. హైదరాబాద్ 2025 క్యూ1లో 40 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 31 శాతం ఎక్కువ. గతేడాది చివరి త్రైమాసికం (క్యూ4)లో 31 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. నగరంలో గృహాలు, ఆఫీసు స్థలాల అద్దెలు ఏటా 9 శాతం మేర పెరుగుతున్నాయి.

నగరం	ఆఫీసు స్థలం (చ.అ.లక్షల్లో)
బెంగళూరు	1.27 కోట్లు
హైదరాబాద్	40
పుణే	37
ముంబై	35
ఎన్‌సీఆర్	21
చెన్నై	18
అహ్మదాబాద్	2
కోల్‌కతా	2

88,274 ఇళ్ల విక్రయాలు..

దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 88,274 యూనిట్లు అమ్ముడుపోయాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా అధ్యయనం వెల్లడించింది. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది రెండు శాతం ఎక్కువ. 2025 క్యూ1లో కొత్తగా 96,309 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. 2024 క్యూ1తో పోలిస్తే ఇది 3 శాతం అధికం. హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 9,459 ఇళ్లు అమ్ముడుపోగా.. 10,661 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి.

ధర	యూనిట్లు	వృద్ధి (శాతంలో)
రూ.50 లక్షల కంటే తక్కువ	21,010	9
రూ.5 లక్షల నుంచి రూ.కోటి	26,832	6
రూ.1–2 కోట్లు	22,330	2
రూ.2–5 కోట్లు	13,735	28
రూ.5–10 కోట్లు	3,448	82
రూ.10–20 కోట్లు	658	114
రూ.20–50 కోట్లు	92	124
రూ.50 కోట్లపైన	169	483

ఎక్స్‌ట్రా రూమ్

ఫ్లాట్లలో అదనపు గది కోరుతున్న కస్టమర్లు

కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితం కావడం అనివార్యమైంది. కరోనా కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీపడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని.. చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్‌ఎల్–రూఫ్ అండ్ ఫ్లోర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్‌తో సహా ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై, పుణే నగరాలలో 2,500 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. పలు కీలకాంశాలివే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌ల నేపథ్యంలో ఫ్లోర్ ప్లాన్స్‌లలో మార్పులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరు మోసిన డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్ట్‌లలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

- వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తాము ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.
- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని ఓ సంస్థ ఎండీ తెలిపారు. కరోనా ప్రారంభం నుంచి ల్యాండ్ బ్యాంక్‌ను సమీకరించిన డెవలపర్లు.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రెండో అర్ధ భాగం నుంచి గృహ లాంచింగ్స్‌లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.



